క్లుప్తంగా

నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ నర్సింగరాజు

గోపాలపట్నం: నేరాలపై అవగాహన కార్యక్రమం చంద్రనగర్ కమ్యూనిటీ హాలులో గురువారం జరిగింది. ఈ సందర్భంగా గోపాలపట్నం క్రైం ఎస్‌ఐ నర్సింగరాజు మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కువగా దొంగతనాలు జరుగుతాయని, చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. గాలి కోసం కిటికీలు తెరిచి నిద్రించవద్దని సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇందుకు సచివాలయం మహిళా పోలీసులు కూడా సహకారం అందిస్తారని తెలిపారు.

ముగిసిన ధ్యాన శిక్షణ తరగతులు



మాట్లాడుతూ కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో 41 రోజులుగా జరుగుతున్న ఉచితంగా ధ్యాన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ మాట్లాడుతూ నిత్యం ధ్యానం చేయడం వల్ల మనిషి ఆరోగ్యవంతంగా, ఆనందంగా తమ జీవనాన్ని సాగిస్తారన్నారు. ధ్యానం మనిషిని ఒత్తిడి నుంచి దూరం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా యోగా, ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్ శివరణేశ్వరరావు, వి.డి.ఈ.రావు, సొసైటి సభ్యులు రేవతిదేవి, డాక్టర్ భాగ్యగౌరీ, వనిత, పద్మావతి, సత్యనారాయణ, అప్పలరాజు, నీలకంఠం, సురేష్, రత్నం, రాజేష్, అనురాధ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి ఫగ్గన్ సింగ్‌కు సాదర స్వాగతం



కేంద్ర మంత్రితో డీఆర్‌ఎం, బీజేపీ నాయకులు

గోపాలపట్నం: కేంద్ర ఉక్కు, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తేకు గురువారం విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, పార్టీ నాయకులు కరణం రెడ్డి నరసింగరావు, బాలరాజేశ్వరరావు, పొలిమేర శ్రీనివాసరావు, దానేష్, నాగేశ్వరరావు, ఉక్కు కర్మాగారం సీఎండీ అతుల్ బట్, రైల్వే విశాఖ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి విమానాశ్రయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విమానాశ్రయం నుంచి మంత్రి రోడ్డు మార్గాన నగరంలోకి వెళ్లారు.

జొమాటో డెలివరీ బాయ్‌పై రౌడీషీటర్ దాడి

మల్కాపురం: జొమాటో డెలివరీ బాయ్‌పై ఓ రౌడీషీటర్ దాడి చేసిన ఘటన మల్కాపురంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన రామ్‌సతీష్‌కుమార్ జొమాటోలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. తన వృత్తిలో భాగంగా మల్కాపురం కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ సమీప ప్రాంతంలోని ఓ వ్యక్తికి ఫుడ్ డెలివరీ చేసేందుకు ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి వచ్చాడు. ఆ సమయంలో బార్ వెనక మార్గంలో ఉన్న మల్కాపురానికి చెందిన రౌడీషీటర్ ఉదయ్.. రామ్‌సతీష్‌కుమార్ వద్దకు వచ్చి ఆ పార్శిల్ తనదేనని, ఇవ్వాలని వాదించాడు. ఆర్డర్‌లో పేరు వేరుగా ఉందని చెప్పి డెలివరీ బాయ్ ఇవ్వడానికి నిరాకరించాడు. ఈ క్రమంలో సతీష్‌కుమార్‌పై ఉదయ్ దాడి చేశాడు. దీంతో బాధితుడు డయల్ 100కు ఫోన్ చేయడంతో మల్కాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై మల్కాపురం సీఐ లూథర్‌బాబు విచారణ చేస్తున్నారు.

ఇంటింటా నీరాజనం

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీలో మహిళకు స్టిక్కర్ అందిస్తున్న కన్వీనర్, గృహసారథులు



59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్



63వ వార్డులో మహిళకు స్టిక్కర్ అందిస్తున్న రామ్మోహనరెడ్డి

మల్కాపురం: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి నియోజకవర్గం అంతటా జనం నీరాజనాలు పలుకుతున్నారు. ఒక వైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, మరో వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న జగనన్నే మా భవిష్యత్ అని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

● 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు. కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటా పర్యటించారు. ప్రజలను కలిసి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో నాయకులు రేవళ్ల సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

● 58వ వార్డు పరిధి పిలకవానిపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఇంటి యజమాని అనుమతితో ఇంటిపై అంటించారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● 61వ వార్డు ఇండస్ట్రియల్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు సంతృప్తికరంగా ఉన్నాయా అని ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఇదే వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద జరిగిన కార్యక్రమంలో గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.



58వ వార్డు పిలకవానిపాలెం వద్ద స్టిక్కర్ అందిస్తున్న చుక్క వరలక్ష్మి

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని క్రాంతినగర్, చింతల్లోవ, కాకరలోవ తదితర ప్రాంతాల్లో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కలిసి వార్డులోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా మెరుగైన పాలనను అందించిందో వివరించారు. ప్రతీ ఇంటిని సందర్శిస్తూ, వారి అనుమతితో ఇంటి గోడపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సోమాదుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలకు ప్రాధాన్యం

ఆటోలకు నంబర్ల కేటాయింపు

పెదగంట్యాడ: ప్రయాణికులకు భద్రతా ప్రమాణాలు మెరుగుపర్చడంలో ఆటో యూనియన్లు సహకరించాలని న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ పెద్దాడ రాజు, లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ శ్రీనివాస్ కోరారు. గాజువాక, మల్కాపురం, పెదగంట్యాడ, దువ్వాడ, పరవాడ, అనకాపల్లి జోన్ల పరిధిలోని మొత్తం 86 ఆటో స్టాండ్లలోని ఆటోలకు పెదగంట్యాడలో గురువారం నంబర్లు కేటాయించారు. వాటిని ఆటో డ్రైవర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు మాట్లాడుతూ జోన్ల వారీగా నంబర్లను కేటాయించడం ద్వారా ప్రయాణికులకు మరింత భద్రత చేకూర్చామన్నారు. ప్రయాణికులు తమ వస్తువులను ఆటోల్లో మర్చిపోతే, వెంటనే వారికి వాటిని అందజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు ఆటో డ్రైవర్లతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశామని, ప్రయాణికులు తమ వస్తువులు మర్చిపోతే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు గొలగాని నాయుడు, రెడ్డి శ్రీను, నాగు, అప్పారావు, నరేష్, శ్రీనివాస్, పాల అప్పలరెడ్డి, దుక్క అప్పలరెడ్డి, నాగరాజు, జగదీష్, ప్రసాద్ పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు స్టిక్కర్లు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐలు రాజు, శ్రీనివాస్

59వ వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డు, కాలువ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్‌నగర్‌లో సుమారు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, కాలువలను వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గురువారం ప్రారంభించారు. కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు చైర్మన్ ఆల్లా కృష్ణ, నాయకులు రేవళ్ల సత్యనారాయణ, అంగ రామ్‌ప్రసాద్, గుడాల బాబూరావు, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటుడు శ్రీకాంత్

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం సినీ నటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ అప్పలనాయుడు అందజేశారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నటుడు శ్రీకాంత్

అందరివాడు.. అంబేడ్కర్

- తమ ఆలోచనలు పంచుకున్న విద్యార్థులు
- రాజ్యాంగ నిర్మాతను విభిన్న కోణాల్లో ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: రాజ్యాంగ నిర్మాత, ఆర్థికవేత్త, న్యాయకోవిదుడు ఇలా విభిన్న రంగాలో అంబేడ్కర్‌ది అందేవేసిన చేయి అని ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్‌స్టీఫెన్ అన్నారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం అమెరికన్ కార్నర్‌లో ఏయూ క్యాంపస్ కళాశాలల విద్యార్థులతో డిబేట్ నిర్వహించారు. 'హూ ఓన్స్ అంబేడ్కర్'(అంబేడ్కర్ ఎవరికి చెందుతారు) అనే అంశంపై విద్యార్థులు తమ భావాలను స్వేచ్ఛగా పంచుకున్నారు. విద్యార్థుల భావాలు, ఆలోచనలు వారి మాటల్లో..



డిబేట్‌లో పాల్గొన్న ఏయూ కళాశాలల విద్యార్థులు

ప్రాజెక్టుల నిర్మాణంలో విశేష కృషి



దేశాభివృద్ధికి నీటి వనరుల లభ్యత, అవసరాన్ని అంబేడ్కర్ గుర్తించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ పాలసీని ఆయన తీసుకువచ్చారు. వ్యవసాయానికి అవసరమైన నీటి విభజన, అనేక ఇరిగేషన్ ప్రాజెక్టుల రూపకల్పన అములులో అంబేడ్కర్ ఆలోచనలు, కృషి ఉన్నాయి. దేశంలో ప్రముఖ ప్రాజెక్టుల నిర్మాణంలో ఆయన కృషి అపారం.

–కె.యతీంద్ర, జియో ఇంజినీరింగ్ విభాగం

దేశ అవసరాలు తీర్చే ఆలోచన..



దేశానికి అవసరమైన విద్యుత్ అవసరాలను తీర్చే దిశగా అంబేడ్కర్ పనిచేశారు. సెంట్రల్ టెక్నికల్ పవర్ బోర్డ్‌ను ఆయన ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా విద్యుద్దీకరణకు పాటుపడ్డారు. పవర్ డిస్ట్రిబ్యూషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఆయన చర్చించారు. హైడ్రో, థర్మల్ పవర్ ఉత్పత్తిని పెంచడానికి అంబేడ్కర్ చేసిన సేవలు అమోఘం.

–టి.అచ్యుత్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం

సమాజంలో వ్యత్యాసాలు రూపుమాపారు..



అంబేడ్కర్ సమాజంలో వ్యత్యాసాలు, అసమానతలను రూపుమాపడానికి కృషి చేశారు. ఆయన తీసుకువచ్చిన యూనిఫాం సివిల్ కోడ్ ఎంతో ఉదాత్త ఆశయంతో చేపట్టినది. ఇది మన కస్టమ్స్‌ని మార్చేస్తుందని అందరూ భావించారు. ఇది వాస్తవం కాదు.. కేవలం అసమానతలను రూపుమాపడానికి దీనిని తీసుకువచ్చారు. న్యాయ విద్యను బోధించడానికి అంబేడ్కర్ ఇష్టపడేవారు.

– డి.హర్షిత, న్యాయ కళాశాల విద్యార్థిని

అంబేడ్కర్ ఆలోచనలతో ఆర్‌బీఐ స్థాపన



దేశంలో ఆర్‌బీఐ స్థాపనకు అంబేడ్కర్ ఆలోచనలే కారణం. బ్రిటీష్ కాలంలో పన్ను వసూలు చేసే కోటి వ్యవస్థను రద్దు చేసి రైతులు, చేనేతకారులను రుణ విముక్తులను చేశారు. ఆర్థికంగా చితికిపోతున్న వారికి కోటి వ్యవస్థ రద్దు ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. కేంద్రం, రాష్ట్రాలకు నిధుల విభజన అంబేడ్కర్ పీహెచ్‌డీ ఆధారంగా జరిగినదే.

– డి.శ్రావ్య, అర్థశాస్త్ర విభాగం విద్యార్థిని

ప్లాస్టిక్ రహిత విశాఖ నగరమే లక్ష్యం

గోపాలపట్నం: ప్లాస్టిక్ రహిత విశాఖ నగరానికి ప్రజలు సహకరించాలని జీవీఎంసీ అదనపు డిప్యూటీ కమిషనర్ సన్యాసిరావు కోరారు. యల్లపువానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శానిటరీ, సచివాలయం అధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్-2023పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరాన్ని మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఇందుకు ప్రతీ పౌరుడు సహకరించాలన్నారు. వంట గది నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన పూర్తిగా మానుకోవాలన్నారు. గెడ్డలు, కాల్వల్లో చెత్త వేయరాదని సూచించారు. సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్, అడివివరం కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ గేదెల మురళీకృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.వి.రమణ, పాఠశాల హెచ్‌ఎం కవిత, పాల్గొన్నారు.



స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తున్న ఏడీసీ సన్యాసిరావు

పేదలకు అండగా సీఎం జగన్



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 59వ వార్డు లక్ష్మీనగర్ కొండ ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన తదితర ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో భరోసా కల్పించారన్నారు. అటువంటి వ్యక్తికి అండగా నిలిచి, ఆయనను రెండో సారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూసీడీ సీవో మహాదేవి, పార్టీ నాయకులు రేవళ్ల సత్యనారాయణ, జి.ఎస్.రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటక్ రాష్ట్ర కార్యవర్గంలో షిప్‌యార్డ్ నాయకులకు చోటు

సింధియా: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంయుక్త రాష్ట్రాల ఐఎన్‌టీయూసీ కార్యవర్గంలో హిందూస్థాన్ షిప్‌యార్డ్ నాయకులు నలుగురికి స్థానం లభించింది. యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పైల శ్రీరామమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్.ధనుంజయరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా యూనియన్ అధ్యక్షుడు పీ.జె.బోసు, వర్కింగ్ కమిటీ మెంబరుగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సురేష్‌లను ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి నియమించారు. ఈ నియామక పత్రాలను గురువారం జరిగిన జిల్లా ఐఎన్‌టీయూసీ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్ చేతుల మీదుగా నూతన కార్యవర్గ సభ్యులకు అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ నుంచి రాష్ట్ర కార్యవర్గంలో నలుగురికి స్థానం కల్పించడంపై షిప్‌యార్డ్ కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.



నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందిస్తున్న మంత్రి రాజశేఖర్

సాగర తీరంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పి.వి.సునీల్‌కుమార్

బీచ్ రోడ్డు: సాగర తీరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏపీ అడిషనల్ డీజీపీ(అగ్నిమాపక) పి.వి.సునీల్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శమన్నారు. సమాజంలో అసమానతలను తొలగించడంలో అంబేడ్కర్ పాత్ర కీలకమైందన్నారు. అంబేడ్కర్‌ను ఒక్క వర్గానికే పరిమితం చేయడం తగదన్నారు. ఆయన అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, సతీష్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా రాజీవ్ గాంధీ, రొయ్యి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ విజయవంతానికి పిలుపు

మల్కాపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలో చేపట్టనున్న ర్యాలీని జయప్రదం చేయాలని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు 59వ వార్డు పరిధి ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ర్యాలీ పోస్టర్‌ను గురువారం సాయంత్రం విడుదల చేశారు. అంతకు ముందు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా అంబేడ్కర్ విగ్రహం చుట్టుపక్కల పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ములకలపల్లి పెంటారావు, సిద్ధార్థ, యు.వి.రావు, సంపత్‌కుమార్, విజయకుమార్, గుడాల బాబూరావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రతినిధులు

ఆసక్తికరంగా నాటక ప్రదర్శనలు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(వీఎండీఏ) ఆధ్వర్యంలో మద్దిపాలెం కళాభారతిలో జరుగుతున్న పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో భాగంగా రెండో రోజు గురువారం ప్రదర్శించిన రెండు నాటక ప్రదర్శనలు ఆసక్తికరంగా సాగాయి. రెండో రోజు ప్రదర్శనలను వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, సీనియర్ నటుడు, రచయిత మిశ్రో ముఖ్యఅతిథులుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో చంద్రమామ రావే.. నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకాన్ని శిష్టా చంద్రశేఖర్ రచించగా, ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. బిడ్డకు బువ్వ పెట్టడానికి అమ్మ చందమామను చూపిస్తూ గోరుముద్దలు తినిపించి బిడ్డ బతకు కోరుకుంటుంది. అదే అమ్మ వృద్ధాప్యంలో చిన్న చిన్న అవసరాలకు పడే వెతలను కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించి కళాకారులు అందరి మన్ననలు పొందారు.

● అనంతరం మనదేశంలో రోజురోజుకు ఆడబిడ్డలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఇతివృత్తంగా కత్రపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ ఆధ్వర్యంలో ప్రక్షాళన నాటకాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఆధునికత మాయలో చేతికందిన టెక్నాలజీ యావలో పడి అమ్మాయిలు తమ జీవితాలపైకి తెచ్చుకుంటున్న వైనాన్ని చక్కని సన్నివేశాలతో ప్రదర్శించి ప్రేక్షకుల హృదయాలను కదిలించారు. ఈ నాటకానికి రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు వహించారు. ఈ కార్యక్రమంలో వీఎండీఏ ప్రతనిధులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.



రెండో రోజు ప్రదర్శనలు ప్రారంభిస్తున్న దాడి వీరభద్రరావు, మిశ్రో, వీఎండీఏ ప్రతినిధులు

హస్త కళాకారులకు ప్రోత్సాహం

డాబాగార్డెన్స్: గ్రామీణ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను పట్టణాల్లో విక్రయించి, వారిని ప్రోత్సహించడమే నాబార్డ్ లక్ష్యంగా పనిచేస్తోందని నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ డీజీఎం కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నాబార్డ్ ఆర్థిక సహకారంతో నేస్తం సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఇన్ మాల్ పేరిట పట్టణాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి వాటిని అందుబాటు ధరలకే విక్రయిస్తున్నట్టు చెప్పారు. నగరంలోని ఓ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 12 వరకు హస్త కళాకారుల ఉత్పత్తుల విక్రయాలు జరుగుతాయని తెలిపారు. హస్త కళాకారులకు స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఉచితంగా వసతి సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. మహా విశాఖ ప్రజలు హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. నాబార్డ్ విశాఖ ప్రాంతీయ అధికారి శ్రీనివాసరావు, నేస్తం ఎన్జీవో సంస్థ సురేష్ మాట్లాడుతూ ఈ స్టాల్స్‌లో హస్త కళాకారులు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులు ప్రజలకు లభిస్తాయన్నారు.



స్టాల్ ప్రారంభిస్తున్న నాబార్డ్ ఏపీ డీజీఎం కేవీఎస్ ప్రసాద్